క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గట్టయ్యసెంటర్‌లో ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ ఆధ్వర్యాన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ రాఘవ రెడ్డి మాట్లాడుతూ.. గురువులు భావిభారత నిర్మాతలన్నారు. ఈ కార్యక్రమంలో ఇటీవల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన పెసర ప్రభాకర్‌రెడ్డితో పాటు మరో 20 మంది ఉపాధ్యాయులకు సన్మానించారు.

తహసీల్దార్‌కు వినతి

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు పెట్రోల్ బంక్ సమీపాన వరదకు తెగిపోయిన రహదారిలో పడి మృతిచెందిన రఘునాథపాలెం గ్రామానికి చెందిన వెన్నమల్ల సాయిచందర్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ పలువురు నాయకులు శుక్రవారం తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణకి వినతి పత్రం అందజేశారు. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొప్పుల ,అశోక్ మాలమహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టు వెంకటేశ్వర్లు, నాయకులు నీరుడి లాజరస్, ప్రసాద్, గండమల్ల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీఐటీలో ఓరియెంటేషన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యాజమాన్యం, అధ్యాపకులు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్(ఎస్‌సీఐటీ)లో శుక్రవారం ఓరియెంటేషన్ నిర్వహించారు. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో చైర్మన్ ఎం.శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ.. ఏళ్లుగా తల్లిదండ్రులకు భరోసాగా నిలుస్తుండమే కాక మహానగరాలకు దీటుగా విద్యనందిస్తున్నామని తెలిపారు. ఫలితంగా ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడుతున్నారని చెప్పారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ దినకర్ మాట్లాడగా అకడమిక్ డీన్ డాక్టర్ సుదర్శన్, డాక్టర్ రాజేష్, కృష్ణప్రసాద్, కుమార్, పద్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తితో కమిషన్ నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ కోసం ప్రభుత్వం నియమించిన కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని, హైకోర్టు న్యాయమూర్తితో కమిషన్ వేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంతెటి వీరభద్రం మాట్లాడారు. ఎస్సీల అభిప్రాయం సేకరించకుండా, కులగణన జరగకుండా, స్పష్టమైన నివేదికలు ప్రభుత్వం దగ్గర లేకుండా ఏకపక్షంగా కమిటీ వేయడం మాల జాతికి మొండిచేయి చూపడమేనన్నారు. హైకోర్టు న్యాయవాది పల్లా రాజశేఖర్ మాట్లాడుతూ.. ఈ మంత్రుల కమిటీలో ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బాబూరావు, దామళ్ల సత్యం, కనకరాజు, గంగాధర్, వేణు, మల్లయ్య, రాధాకృష్ణ, నాగార్జున, యోనా, గొట్టిముక్కల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	3
వంకాయ	66		20
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	66	చుక్కకూర	3
బోడ కాకర	140		20
బీర	66	తోటకూర	3
దొండ	46		20
పొట్లకాయ	56	గోంగూర	5
చిక్కుడు	110		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	44		50
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	56		25
క్యాప్సికం	76	-ఖమ్మం వ్యవసాయం	

వైకుంఠధామం.. వరదపాలు



వరద ఉధృతికి నేలమట్టమైన ప్రకాశ్‌నగర్ వైకుంఠధామం(ఫైల్)

రూపు కోల్పోయిన ప్రకాశ్‌నగర్ శ్మశానవాటిక

- కూలిపోయిన నిర్మాణాలతో అస్తవ్యస్తంగా మారిన వైకుంఠధామం
- దహన సంస్కారాల నిర్వహణకు ఇబ్బంది మారిన వైనం
- కనీస సౌకర్యాలతో పునరుద్ధరించాలని స్థానికుల వేడుకోలు

ఖమ్మంగాంధీచౌక్: భారీ వరదల విపత్తులో ప్రకాశ్‌నగర్ శ్మశానవాటిక రూపురేఖలు కోల్పోయింది. అయితే దహన సంస్కారాలకు కనీస సౌకర్యాలతో పునరుద్ధరించాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కరోనా విపత్తులో మరణాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం 2022లో సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో ప్రకాశ్‌నగర్ మున్నేరు ఒడ్డున వైకుంఠధామాన్ని నిర్మించింది. బోరు, గదులు, దహనానికి సౌకర్యవంతంగా నిర్మాణాలు, ప్రహరీ గోడలు, స్నానాల గదులు వంటి నిర్మాణాలు చేపట్టింది. అయితే వర్షాల కారణంగా మున్నేరుకు మునుపెన్నడూ లేనివిధంగా భారీ వరద నీరు పోటెత్తడంతో తీవ్ర నష్టాలు సంభవించాయి. వీటిలో ప్రకాష్‌నగర్ వైకుంఠధామం ఒకటి.

కొట్టుకుపోయిన శ్మశానం..

వరద బీభత్సానికి ప్రకాశ్‌నగర్ వైకుంఠధామ నిర్మాణాలు కొట్టుకుపోయాయి. ఈ వైకుంఠధామం ప్రకాశ్‌నగర్, శ్రీనివాసనగర్, టీచర్స్ కాలనీ, వ్యవసాయ మార్కెట్, సుందరయ్యనగర్, ఎఫ్‌సీఐ గోదాం, కుమ్మరి బజార్, ఎరుకల బజార్ ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాంతంలో ప్రధానంగా పేద వర్గాలు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ ఆధారంగా పనులు చేసుకుంటూ జీవనం సాగించే కార్మిక కుటుంబాలే ఎక్కువగా నివసిస్తుండడం గమనార్హం.

కనీస సౌకర్యాలు కరువు..

వరదలతో ధ్వంసమైన ప్రకాశ్‌నగర్ వైకుంఠధామంలో తాత్కాలికంగా అయినా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. కూలిపోయిన నిర్మాణాలను తొలగించి ప్రస్తుతం దహన సంస్కారాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరణాలు సంభవించిన సమయాన రాకపోకలు ఇబ్బంది లేకుండా కూలిపోయిన నిర్మాణాలను తొలగించి చర్యలు తీసుకోవాలని, నూతన వైకుంఠధామానికి ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పునరుద్ధరణ పనులు చేపట్టాలి..



ప్రభుత్వం ప్రజా అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పేద ప్రజలు, కార్మిక వర్గాలకు సౌకర్యవంతంగా ఉన్న ప్రకాశ్‌నగర్ వైకుంఠధామం తిరిగి నిర్వహణలోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలి. కూలిపోయిన గోడలను తొలగించి, తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి. ఇతర వైకుంఠధామాల్లో నిర్వహిస్తున్న పునరుద్ధరణ పనులు ప్రకాశ్‌నగర్ శ్మశాన వాటికలో కూడా చేపట్టాలి.

– సోమవరపు సుధీర్‌కుమార్, ప్రకాశ్‌నగర్, త్రీటౌన్

వరద నష్ట పరిహారం పెంచాలి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాలతో సంభవించిన వరదల వల్ల నష్టపోయిన బాధితులకు అందించే పరిహారాన్ని పెంపుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు కోరారు. ఈమేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు రైతు సంఘం ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. నష్టం అంచనా లోపభూయిష్టంగా ఉందని, అశాస్త్రీయ పద్ధతులలో నష్టాన్ని అంచనా వేశారన్నారు. నష్టానికి అనుగుణంగా ముంపునకు గురైన ప్రతీ ఇంటికి రూ.25 వేలు ఇవ్వడంతో పాటు పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు బదులు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. అలాగే ముంపు ప్రాంతాల్లో శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆకేరు, మున్నేరు, కట్టలేరు, వైరా నది పరీవాహక ప్రాంతాల్లో సాగుకు పనికిరాకుండా పోయిన వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.2 లక్షలు పరిహారం ఇప్పించి ఉచితంగా ఎరువులు, విత్తనాలు అందించాలని రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గసభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, అజ్మీర రామ్మూర్తి, పగడల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాల్వ గండ్లు పూడ్చాలి

నేలకొండపల్లి: వరదలకు తెగిన కాల్వ కట్టల గండ్లను వెంటనే పూడ్చాలని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి అన్నారు. మండలంలోని బోదులబండలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ కాల్వకు గండ్లు పడి రెండు వారాలు దాటినా.. మరమ్మతులు పూర్తి చేయలేదని, యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చి నీటిని విడుదల చేయాలన్నారు. నీరు అందక పంటలు ఎండుతున్నాయని, నీటిని విడుదల చేయలేని పక్షంలో ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు, శాఖ కార్యదర్శి చింతలపాటి భాస్కర్, కట్టికోల వెంకన్న, చిన్నికృష్ణ, అలపాటి సీతారామారావు, వెంకటేశ్వర్లు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా రెడీ..

రఘునాథపాలెం/నేలకొండపల్లి: మండలాల్లోని గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితాలను శుక్రవారం ఆయా పంచాయతీ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డుల్లో వెల్లడించారు. నమూనా జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 కల్లా ఆయా పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని రఘునాథపాలెం, నేలకొండపల్లి ఎంపీఓలు శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్ శివ తెలిపారు. తుది జాబితాలను ఈ నెల 28న ప్రకటించబడుతుందన్నారు. కాగా, నేలకొండపల్లి మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీల్లో 20 జీపీలకు చెందిన కార్యదర్శులు బదిలీ కావడంతో నూతన కార్యదర్శులు జాయినింగ్ రిపోర్టు చేసి ఓటర్ల జాబితాను ప్రకటించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని టౌన్–1 సెక్షన్ పరిధిలోని గాంధీచౌక్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మౌలిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఎమ్మార్వో ఆఫీస్ రోడ్, సాయిరాం థియేటర్, మోతీనగర్, బొక్కలగడ్డ, పంపింగ్‌వెల్ రోడ్, ఫిల్టర్ బెడ్, పెద్దమ్మతల్లి గుడి, పంపింగ్‌వెల్ రోడ్ ఆటో స్టాండ్, పీఎస్‌ఆర్ రోడ్, గాంధీచౌక్, సుందర్ మ్యాక్స్ థియేటర్ రోడ్, కన్యకా పరమేశ్వరి గుడి లైన్, జహీర్‌పురతండా, వెంకటలక్ష్మి టాకీస్ రోడ్, గాంధీనగర్, సుందరయ్యనగర్, వ్యవసాయ మార్కెట్ ప్రాంతం, బోస్ బొమ్మ సెంటర్, మంచికంటి నగర్–2 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే మోమినాన్ 160 కేవీఏ, శుక్రవారపు పేట 315 కేవీఏ, 33/11 కేవీ రామాలయం సబ్ స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–5 ఏఈ ప్రభాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మోమినాన్ ఏరియా, కబేలా మసీదు ఏరియా, శుక్రవారపు పేట ప్రాంతం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.అదేవిధంగా నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ బి.తావుర్యా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో బైపాస్ రోడ్, వేణుగోపాల్‌నగర్, బాలాజీనగర్, యూపీహెచ్ కాలనీ, విజయ్‌నగర్ కాలనీ, బ్యాంక్ కాలనీ, కవిరాజ్‌నగర్, గట్టయ్య సెంటర్, ప్రశాంతినగర్, వైరారోడ్, జెడ్పీ సెంటర్, కోర్టు ఏరియా, జమ్మిబండ, సీక్వెల్ రోడ్, రమణగుట్ట, పాత కలెక్టరేట్ వెనుక ప్రాంతాల్లో కరెంట్ కోత విధించబడుతుందన్నారు. విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

నేడు స్తంభాద్రి ఆలయంలో ప్రవచనం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ప్రాచీన దివ్యక్షేత్రం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం 5:30 గంటల నుంచి ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరి జగన్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి లక్ష్మీనరసింహ స్వామి వారి లీలా విలాసంపై ప్రవచనం చేస్తారని తెలిపారు.

పెండింగ్ వేతనాలు జమ

ఖమ్మంవైద్యవిభాగం: 104 ఉద్యోగుల ప్రధాన సమస్యలపై ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ ఆధ్వర్యాన డీఎంహెచ్‌ఓ డాక్టర్ వరికూటి సుబ్బారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ప్రధాన సమస్యలన్నింటినీ ఖమ్మం జిల్లా టీఎన్జీవో నాయకులు కొనిదెన శ్రీనివాస్, ఎస్‌జైపాల్, గుంటుపల్లి శ్రీనివాస్, వల్లపు వెంకన్న, తాళ్లూరి శ్రీకాంత్, బూస చంద్రశేఖర్‌లు డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఉద్యోగులకు సంబంధించి మూడు నెలల జీతాలను వారి అకౌంట్లోకి జమచేయించారు. ఈమేరకు డీఎంహెచ్‌ఓకు కృతజ్ఞతలు తెలిపి ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

వెల్లువెత్తుతున్న వరద సాయం



తిరుమలాయపాలెం: రాకాసితండా వరద బాధితులకు ఫ్యాన్లు అందిస్తున్న ఎస్సై జగదీశ్



ఖమ్మం సహకారనగర్: వంట సామగ్రి అందించి మాట్లాడుతున్న మల్లు నందిని విక్రమార్క



ఖమ్మం మామిళ్లగూడెం: నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న తెలంగాణ సిటిజన్స్ ఫోరం బాధ్యులు



నేలకొండపల్లి: సుర్దేపల్లిలో నిత్యావసరాలు అందిస్తున్న బీజేపీ నాయకులు



ఖమ్మంఅర్బన్: బెడ్ షీట్లు అందిస్తున్న స్నేహ హస్తాల ఫౌండేషన్ సభ్యులు

☞ తిరుమలాయపాలెం: మండలంలోని రాకాసితండా వరద బాధితులకు యంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం దుప్పట్లు పంపిణీతో పాటు ఆహారం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే తిరుమలాయపాలెం మండల ఎస్సై కూచిపూడి జగదీశ్ రాకాసితండాలోని 77 కుటుంబాలకు సీలింగ్ ఫ్యాన్లు అందించగా.. రాజారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల ఉపేందర్‌రెడ్డి దుప్పట్లు అందించారు.

☞ ఖమ్మం సహకారనగర్: మున్నేరు వరద బాధితులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని విక్రమార్క వంట సామగ్రి పంపిణీ చేశారు.

☞ ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ సిటిజెన్స్ ఫోరం(విశ్రాంతి ఉపాధ్యాయుల వేదిక) ఆధ్వర్యాన ఖమ్మం 16వ డివిజన్ సీఈఎస్ అగ్రహారం పాఠశాల విద్యార్థులందరి కుటుంబాలకు రూ.1,000ల విలువ గల నిత్యావసరాల సరుకులు అందజేశారు.

☞ నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లిలో వరద బాధితులకు బీజేపీ ఆధ్వర్యాన జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

☞ ఖమ్మంఅర్బన్: నగరంలోని రామన్నపేట వరద బాధితులకు శుక్రవారం స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యాన రూ.17 వేల విలువైన 200 బెడ్‌షీట్లను పంపిణీ చేశారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు..

గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని శుక్రవారం వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పూజ ప్లేట్లు, పూలు, ఇతరత్రా పూజా సామగ్రి అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: చైతన్యనగర్‌లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



నేలకొండపల్లిలో రూ.60వేలు విలువైన నోట్లతో అలంకరణ



ఖమ్మంఅర్బన్: శ్రీనగర్‌కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు



కామేపల్లి: పండితాపురంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న తుంబూరి దయాకర్‌రెడ్డి



ఖమ్మంగాంధీచౌక్: గాంధీచౌక్‌లో మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అన్నదానం



ఖమ్మంగాంధీచౌక్: రాపర్తినగర్‌లో పూజా సామగ్రి అందిస్తున్న మేయర్ నీరజ, నిర్వాహకులు



ఖమ్మంవన్‌టౌన్: ఫారెస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యాన అన్నదానం

గణేషుడి శోభాయాత్ర ప్రశాంతంగా జరగాలి



రఘునాథపాలెం: మాట్లాడుతున్న సీఐ ఉస్మాన్‌షరీఫ్, పక్కన తహసీల్దార్, ఎస్సై

రఘునాథపాలెం/నేలకొండపల్లి: వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించే శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్, నేలకొంపల్లి ఎస్సై పి.సంతోష్‌లు ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం రఘునాథపాలెంలోని రైతు వేదికలో తహసీల్దార్ లూధర్‌విల్సన్‌తో కలిసి ఉత్సవ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఉస్మాన్‌షరీఫ్, నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో సంతోష్లు మాట్లాడారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు చేపట్టామన్నారు. శోభయాత్రలో మద్యం సేవించి పాల్గొంటే చర్యలు తీసుకుంటామని, ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే వినియోగించాలని, డీజేలు,లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలు పాటించనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిమజ్జన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ వంతెనల వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఘాట్‌లను మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వరదలతో దెబ్బతిన్న ఘాట్ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఫ్లడ్ లైట్లను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ఈఈ కృష్ణాలాల్ ఉన్నారు.

చైతన్య యాత్రను జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 15 తేదీన ఖమ్మం వస్తున్న ఉద్యమకారుల చైతన్య యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యాన తెలంగాణలోని అన్ని జిల్లాల చైతన్య యాత్రలో భాగంగా హైదరాబాద్ ఉత్తర తెలంగాణలో యాత్ర ముగించుకొని దక్షిణ తెలంగాణ యాత్రలో భాగంగా వస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఖమ్మం అమరవీరుల స్తూపం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈనెల 27న సికింద్రాబాద్‌లో ఉద్యమకారులందరినీ సన్మానించి, గుర్తింపుకార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డిబోయిన వరలక్ష్మి, ఉమాయాదవ్, నరేందర్, సతీష్, రాంబాబునాయక్, విజయకుమార్, రాజేందర్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డునే కొనసాగించాలి



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించకుండా వెల్ఫేర్ బోర్డు ద్వారానే కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని 3వ డివిజన్ బల్లెపల్లిలో భవన నిర్మాణ కార్మికుల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీ నియమించి నిధులను దారి మళ్లించకుండా కార్మిక సంక్షేమ కోసమే ఖర్చు చేయాలని, ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా వెల్ఫేర్ బోర్డు డబ్బులను ఇతర రంగాలకు మళ్లించి దుబారంగా ఖర్చు చేసిందని, నేటి ప్రభుత్వం అలా జరగకుండా చూడాలని, అసెంబ్లీలో ప్రకటించిన లక్ష మోటార్ సైకిళ్లను కార్మికులకు అందించేందుకు నిబంధనలు రూపొందించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నామని, 23న హైదరాబాద్‌లో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యాన మహాధర్నా నిర్వహించనుండగా.. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా కార్యదర్శి కె.శ్రీనివాస్, కార్మిక సంఘం జిల్లా నాయకులు ఉపేందర్, నరేష్, రమేష్, ఎల్లయ్య, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.